కథానిక

# వెలుతురులోకి—

జోశ్యుల సూర్యనారాయణమూర్తి

"ఆ సుబ్బిగాణ్ణల్లా చావగొట్టారేమండీ పాపం?"

"కొడతానా, నరుకుతానా? అసలు చంపేసే వాణ్ణి. రాజు అడ్డంవచ్చాడు కనక బతికాడు."

"అయితే చంపుకుంటారా? అంతకోపం ఏమిటి? నయానా, భయానా చెప్పాలిగాని? కొడితే మాత్రం అంతల్లాగా? వీపుమీద నాలుగువేళ్లూ ఎలా తేలాయో చూడండి. నడవలేకపోతున్నాడు పక్కటెముక ఏ యెముకైనా విరిగిందో ఏమిటో? కాలు పట్టేస్తున్నాడు. అంత కోపమా దానిల్లు బంగారంగానూ!"

"చాల్లేయింక. కట్టిపెట్టు ఉపన్యాసం. వెధవలకి నా యింట్లో స్థానంలేదు."

"బాగుందిలెండి. ఐతే చంపుతారా? అంతా మంచివాళ్లే పుడతారా? అదీ మనకర్మ. ఆ వెధవ కెన్నిసార్లు చెప్పినా మీ జేబులు తడమటం వాడు మానడు. అణో, బేడో తీసినంత మాత్రాన ముక్కలు విరగదన్నుతారా? అందకుండా పెట్టుకోవాలిగాని."

"నిన్ను చాలించమనలేదూ? ఈ అణాలు బేడలే రూపాయలు, నగలు ఎత్తుకుపోయేలా చేస్తాయి. ఎక్కడ దాచుకుంటాం. ఇంటి దొంగని ఎవడు పట్టుకుచావగలడు? ఈవేళ యిదైంది, రేపే పెద్దమనిషేనా యింటికి వచ్చి చొక్కా వదిలినా ఈ వెధవేదైనా చేసేడంటే అప్రతిష్ఠ పాలైపోమా? ఆ వచ్చిన పెద్దమనుషులు మనతో ఈ చిన్నసంగతులు చెప్పటానికీ మొహమాట పడతారు. రానురాను వీడికీ బుద్ధులు ఎక్కువవుతాయి. ఏం? రోగమా? ఎన్నిసార్లు నయానా భయానా చెప్పలేదు? వాడికేదైనా కావలసివస్తే నే నివ్వటంలేదూ?"

"ఎందుకివ్వటంలేదు? వాడినలా పుట్టించాడు దేవుడు."

"మరేం రోగం? పుట్టిస్తాడు పుట్టిస్తాడు. మన కర్మం అని నెత్తినెక్కించుకో, బాగుపడతాడు. ఈమధ్య నిదేమిటో కొత్త సిద్ధాంతాలు బయలుదేరాయి. పరిస్థితులు దొంగలను తయారుచేస్తాయట. నాతో వాదిస్తాడు రాజు. పోనీ పెద్దవాడు చదువుకొంటున్నాడే కాలపు చదువని వాడు చెప్పినట్లు కూడా చేసిచూద్దామని అడపాతడపా ఆ అన్నగారు చెప్పినట్టు ఈ తమ్ముడుగారిని ఏది కావాలంటే అది నే నివ్వటంలేదా? పరిస్థితులు గాదు. మెత్తగా ఊరుకొంటూంటే ఈలాంటి దుర్గుణాలే పెరుగుతూ ఉంటాయి. చేసినప్పుడు తగిన శిక్ష ఎప్పటికప్పుడు విధించటమే పరిస్థితుల ననుకూలపరచటం. నీకేం తెలుసులే! నువ్వు లోపలికి పో. చేతకాని మాటలు మాట్లాడుతూ వాణ్ణి వెనకేసుకు రాకు."

"అయినా నాకెందుకులెండి. ఎంత మాట్లాడకుండా ఉందామనుకొన్నా కడుపుతీపి యిలా వాగిస్తుంది. కానీయండి వాడి యోగం ఎలావుందో?"

నిజంగా సీతమ్మగారికి తన కొడుకును వెనకవేసుకురావాలనిగాని వాడెప్పుడూ దొంగతనాలే చేస్తూ ఉండాలనిగాని మనస్సులో ఎంతమాత్రం లేదు. అసలే తల్లికే తనకీ కొడుకు దుర్వృత్తులవలన ధనం సంపాదించాలని, దానివల్ల బాగుపడతాడని ఉండదేమో! కాని కొంద రమాయికలైన తల్లులకు తన కొడుకులు గొప్ప నటకులుగానో రాజకీయ నాయకులుగానో పేరుపొందాలని ఉండవచ్చు. అది పూర్వకాలపు తండ్రులకు కిట్టకపోవచ్చు. అటువంటప్పుడు భర్తతో పోరాడి అటువంటి యిల్లాలు తన కొడుకు చేసే పనికి దోహదం చేస్తుంది. తండ్రికి కొడుకు చేసే పనులు వెర్రి వేషాలుగా కనిపించి నిరాకరిస్తాడు. కాని పరిస్థితుల ప్రాబల్యంవల్ల కొడుకు తన ప్రవర్తన మానక బాగుపడవచ్చు. చెడిపోవచ్చు. ఏమైనా యిన్ని సంగతులాలోచించలేని సీతమ్మగారు తన కొడుకు దొంగ

అవటాన్ని ఒప్పుకోదు. తండ్రి వాణ్ణంతగా చావ గొట్టటానికే ఒప్పుకోదు. ఆమె తన కడుపుతీపితో తాను బాధపడుతుంది.

రామారావుగారికి ముగ్గురు కొడుకులు. పెద్దవాడు రాజేశ్వరరావు. ఇద్దరుముగ్గురు పిల్లలతర్వాత ఈ సుబ్బారావు పుట్టాడు. వీడు ఫస్టుఫారం రెండేళ్ళు తప్పి చదువు మానటంవల్ల పనిలేక తిరుగుతున్నాడు. దొంగబుద్ధి చిన్నతనంనుంచీ కొద్దోగొప్పో లేకపోలేదు. సుబ్బారావు తరువాత వాడు కృష్ణమూర్తి. వాడు పాపం, మళ్ళీ చిన్నప్పటినుంచి ఒక పిడికెడు వెన్నముద్దయినా దొంగలించిన పాపాన పోలేదు. వాళ్ళ యింటిలో మూడు గేదెల పాడి ఉంది. సీతమ్మగారు పిల్లల్ని బాగా పెంచుతుంది. అడగకుండానే వెన్నపెట్టేది. అందుచేతే వాడికా బుద్ధిపుట్ట అలవడలేదని కొందరనవచ్చు. కాని సీతమ్మగారికి పక్షపాతబుద్ధి లేదు. ఆమె దృష్టిలో తన ముగ్గురు కొడుకులూ ఒకటే. పెద్దవాడు బి.యే. ప్యాసైనాడు. ఇంకా చదవాలనుకొంటున్నాడు. ఆఖరివాడి పద్ధతిచూస్తే వాడూ చదువులో తొందరగా అందుకుపోయేటట్టే కనిపిస్తున్నాడు. వీళ్ళిద్దరిని దుష్ప్రవృత్తులకు లోబడేటట్టు చేయలేని పరిస్థితుల ప్రాబల్యం సుబ్బారావుకే దొంగబుద్ధి ఎల్లానేర్పిందో సీతమ్మకు ఊహించటం చేతకాలేదు. రామారావుగారికీ అర్థంకావటం లేదు. ఒకప్రక్కనించిచూస్తే సీతమ్మగారి చాదస్తం మాటలే యథార్థంగా కనిపిస్తాయి.

రామారావుగారు కొన్ని ఆదర్శాలు కలవాడు. తినటానికింత ఉండి నలుగురిలోను మంచివాడనిపించుకోటానికి ఆయన ధర్మబుద్ధే కారణం. ఆయన కనుకూలపడిన పరిస్థితులవలన భారత సంప్రదాయాన్నిగూర్చి ఆయన చాలా చదవగలిగాడు. కాని మన ఆచార వ్యవహారాలలోనూ, ధార్మిక వ్యవస్థలోనూ ఏమీ సంస్కారం అక్కరలేదనే సంగతి ఆయనంగీకరించలేకపోతున్నాడు. మానవుడు పరిస్థితులకు లొంగిపోయి చివరకు కలిగే మంచిచెడ్డలకు తాను బాధ్యుడను కాదనుకొనేకంటే వీలైనంతవరకు పరిస్థితుల్ని ఆత్మబలంచేత వశపరచుకోవటం మంచిదని ఆయన ఉద్దేశం. దానికి ధర్మమార్గం సహాకరిస్తుందని ఆయన విశ్వాసం. ధర్మంముందు బాంధవ్యానికాయన దృష్టిలో విలువ లేదు. సగరచక్రవర్తి అసమంజసుణ్ణి వెళ్ళగొట్టిన కథ ఆయనకు బాగా నచ్చింది. అదే పదేపదే ఆయన చెప్పుతూఉండటం వినగావినగా రాజేశ్వరరావుకు తన తండ్రి సుబ్బారావును ఎప్పుడో వెళ్ళగొడతాడనే భయం ఒకప్రక్క కలుగుతూనే ఉంది. ఈమధ్య తన తండ్రి తనకా కథ చెప్పినప్పుడు తాను దుర్యోధనుడి సంగతేమిటనడిగాడు. ఆ మాట విని తండ్రి నవ్వి ఊహాశాలియైన తన పెదకొడుకుతో "నువ్వే చెప్పు ఆ సంగతేమిటో" అన్నాడు. రాజేశ్వరరావు ఉద్దేశ్యం ఏమిటంటే—పరిస్థితుల ప్రాబల్యంవల్ల దుర్యోధనుడు చెడ్డాడని. భీష్మద్రోణాది మహాధార్మికులున్నచోట గూడ దుర్యోధనుడి కాగలి పట్టిందంటే అక్కడ కారణం పరిస్థితులే అని. రామారావుగారు కొడుకు ఊహాలకు సంతోషించాడు. "అందుకే పరిస్థితులనల్లా ఉండనివ్వకూడదని నేనంటున్నా"నన్నాడాయన. "నేననేదీ అదేకదా"అని కొడుకన్నాడు. ఐతే దుర్యోధనుడి విషయంలో విదురుని మాటలు వింటే ధృతరాష్ట్రుడు కొడుకునట్లా చెడిపోనిచ్చేవాడు కాదని రామారావుగారి ఊహ.

రాజేశ్వరరావు సుబ్బారావు కాంక్షించేవేవో అతనికీ లభించటంలేదు గనకనే అతనికి పరిస్థితులు వ్యతిరేకమై చెడ్డదారులు పడుతున్నాడని తానూహించగల్గినంతవరకు తండ్రికి చెప్పగల్గాడు. తండ్రి ఉద్దేశ్యంలో కూడా పరిస్థితులకు లొంగకపోవటమే ప్రధానం కాబట్టి కొడుకు మాటలను త్రోసిపుచ్చనవసరంలేకపోయింది. చేతనైనంతవరకు బహువిధాల ప్రయత్నంచేసి సుబ్బారావు కనుకూల పరిస్థితులు తాను కల్పించగల్గుతూ ఉన్నట్టే తృప్తిపడుతూ వచ్చాడు. సుబ్బారావు దుర్బుద్ధి మారలేదు. పైగా వయస్సుతోపాటు పెరిగిందేమో కూడా.

రాజేశ్వరరావుకు తమ్ముడంటే అపరిమితమైన ప్రేమ. వాడికా ఒక్క దుర్బుద్ధిలేకపోతే తనూ వాడూ కలసి ఎన్నైనా ఘనకార్యాలు సాధించవచ్చునని అనుకొంటూ ఉండేవాడు. సుబ్బారావు తెలివితేటలు తన తెలివినిమించి ఉన్నాయి. కాని ఆ తెలివితేటలన్నీ రానురాను

చౌర్యానికే దోహదం ఇస్తూఉండటం తన మనస్సు కెంతో కష్టంగాఉంది. తాను మొదట అనుకొన్నట్టుగా సుబ్బారావుదొంగతనానికనుకూలించేపరిస్థితులేమీ తనకు కనపడటంలేదు. తరువాత తరువాత తండ్రికూడ వాణ్ణెక్కువ శిక్షించిందీలేదు. కాని వాడిష్టంవచ్చినట్టు సంచరించటాన్ని మాత్రం ఆయన బ్రదికి ఉండగా అంగీకరించినదీలేదు.

రాజేశ్వరరావు తను చదువుకొన్నాడు కనక తనతల్లిఅనుకొన్నట్లు "వాడియోగం" అని "నాడి కర్మం" అని అనుకొని మాత్రం సరిపెట్టుకోలేక పోతున్నాడు. ఒకనాడు సుబ్బారావుని పిలిచి "ఏరా స్నేహితులు నలుగురూ నిన్ననుమానంగా చూస్తున్నట్టున్నారు. నీకింకా ఆ బుద్ధిపోలేదా" అని అడిగినందుకు అతనికి చాల కోపంవచ్చింది. "మీరంతా ధర్మపరులు" అని "మీవంటి నిజాయితీ బ్రతుకు నాకులేదు కనక నన్ను నమ్మటంలేదేమో" అన్నాడు.

"అదికాదురా! ఒకళ్ళ కనుమానం కలిగేలాగ మన మెందుకు ప్రవర్తించాలి? అని నేననేది" అని ఉపదేశంచేసే పెద్దరికంతోసావధానంగా అన్నాడు రాజేశ్వరరావు.

తమ్ముడు "చాల్లే నీ లాయరు కబుర్లు కట్టిపెట్టు నన్నుగురించి వాళ్ళదగ్గర నీవేమి చెప్పావో? వాళ్లెందు కనుమానిస్తున్నారో నాకేం తెలియదు." అని "కాకపోయినా అంతా నీలాగే ఉంటారా?" అన్నాడు.

"అంతా నాలాగా ఉండరు. అంతా నీలాగా ఉండరులే" అని రాజేశ్వరరావు తన ఉపదేశం చాలించాడు.

తన భాగం తనచేతికివచ్చి తన జీవితం తన ఇష్టం వచ్చినట్టు నడుపుకొనే రోజులు వచ్చాక కూడా (అడపాతడపా) చేయివాటుతనం సుబ్బారావుకు తగినట్లు కనపడదు.

రాజేశ్వరరావు పట్టణంపోయి ఉద్యోగం చేసుకొంటూ నలుగురిలోనూ మర్యాదగా మెలగుతున్నాడు. సుబ్బారావుని గురించి ఆలోచించటం మానేశాడు. కాని ఎప్పుడేనా జ్ఞాపకంవచ్చినప్పుడు దుఃఖించటంతప్పటంలేదు. ఒకసారి .తనున్నచోటికి సుబ్బారావు వచ్చాడు ఏదోపనిమీద ఆ రాత్రిఅన్న గారివద్దనే ఉన్నాడు. మరునాడుదయం ప్రక్కవాటాలో జరిగిన దొంగతనాన్ని గురించి చెప్పుకొంటూంటే ఏమిటని అన్నగార్ని ఆదుర్దాగాఅడిగాడు సుబ్బారావు. రాజేశ్వరరావు ఇది తన తమ్ముడు పనేమోనని మొదట అనుమాన పడ్డాడు కాని యీ మధ్య అతన్ని గురించి తనకేమీ తెలియకపోవటం వల్ల తన అభిప్రాయమే పొరపాటనుకొన్నాడు. భోజనంచేసి తనాఫీసుకి వెళ్ళిపోయాడు. సాయం కాలం యింటికి వచ్చిన తర్వాత తనతో మాట్లాడటానికి వచ్చిన పక్కింటాయన చిదంబరంగారు ఏవో పుస్తకాలు తీయటంలో పెట్టి వెనకాలపడి ఉన్న తమ గొలుసు బయటకు తీశాడు అదేమిటని రాజేశ్వరరావాదుర్దాగా అడుగుతూంటే మొదట తెల్లబోయాడు గాని కొద్ది క్షణాల్లోనే తేరుకొని చిదంబరం నిన్నమాయింటిలో పోయిందనుకొన్న గొలుసిదేనని చెప్పేసరికి రాజేశ్వరరావు ముఖంలో నెత్తురు చుక్కలేదు. నిన్నపగలెందుకో వాళ్ళింటికి వెళ్ళి రాజేశ్వరరావు కొంచెంసేపు కూర్చొనివచ్చిన మాట నిజమే. రాజేశ్వరరావు తెల్లబోతూ ఉండటంచూచి చిదంబరం తాను బాగా తెలివైనవాడిలాగ "చాల్లేవయ్యా పెద్దమనిషీ. అందుకే యీ రోజుల్లో ఎల్లాంటి వాళ్ళకూ చను వివ్వకూడదు పైగా పెద్ద ఉద్యోగస్థులే. ఉద్యోగస్థులేం పనిచేసినా కనపడదనుకుంటున్నావు కాబోలు. ఇప్పుడు నిన్ను పోలీసు కప్పగిస్తే నీగతేమౌతుందో తెలుసా?" అనేసరికి రాజేశ్వరావు నిశ్చేష్టుడై తన తమ్ముడుచేసిన పనికి దుఃఖం పొంగివచ్చి నోటమాటరాక బిగిసిపోయాడు. వాడిల్లా తన మర్యాద'మంట గల్పుతాడని తనెప్పుడూ ఊహించలేకపోయాడు. ఇదంతా చిదంబరానికి తానుపడ్డ ఊహ నిజమే అనుకోవటానికి సహకరించింది. దానితో ఆయన మఱింత రెచ్చిపోయి కేకవేస్తుండగా సుబ్బారావు చక్కా వచ్చాడు.

"ఏమిటన్నయ్యా" అని ఏమీ తెలియనట్టే అడిగాడు.

"ఏముంది అన్నయ్య చేసిన ఘనకార్యం. పెద్ద మనిషిలా ఇంటికివచ్చి కూర్చొని గొలుసు ఎత్తుకు వచ్చాడు." అని చిదంబరంగారనడం. "ఏదో పొరపాటు జరిగిపోయింది లెండని" "క్షమించం

డని" తన అన్నగారనటం వింటే సుబ్బారావుకి చాలా బాధకలిగింది. తనంటే అంత ప్రేమఉన్న అన్నయ్యకు ఈవిధంగా అపకీర్తి కలిగించేలా తన ప్రవర్తన పరిణమించటం తను భరించలేకపోయాడు. పైగా ఇప్పుడు తనమీద నా నేరం మోపటం తేలికైనా ఆపని చేయటం తనకే యింకా అపకీర్తని అన్నయ్య పాపం తనంతట తానే దాన్ని భరించ పూనుకోవటం పూర్తిగా సుబ్బారావులో మార్పు తెచ్చేందుకెంతైనా సహాయపడింది. ఏ వేళలోఎటువంటి ప్రభావముందో ఎవరుచెప్పగలరు?

"ఆ దొంగతనం చేసింది నేను" అన్నాడు సుబ్బారావు.

"వాడుకాదు నేనే" అన్నాడు।రాజేశ్వర్రావు.

"ఏమో ఎవరో? ఎవరైతేం? ఇద్దఱూకలిసే చేశారేమో!" అని చిదంబరంగారు చిరాకు పడుతూ ఉండగా సబినస్పెక్టరు లోపలికివచ్చాడు. మిష్టర్ రాజేశ్వరరావు అని పిలుస్తూ. సమయానికి వచ్చారంటూ ఆయన్ని చిదంబరంగారేదో చెప్ప బోయేలోపలే "ఏరా సత్యం" అంటూ వచ్చిన ఇనస్పెక్టర్ని రాజేశ్వర్రావు పలకరించాడు. వీళ్ళ పరిచయానికి చిదంబరంగారు తెల్లబోయాడు.

"నామీద కేసువచ్చిందిరా. నీ దగ్గరకు వద్దామనుకొంటూంటే నువ్వే వచ్చావు." అన్నాడు రాజేశ్వరరావు.

"ఏం? ఏమిటి?"

"నిన్న నేనొక గొలుసు దొంగతనం చేశాను. అది యీాయనది ఇప్పుడే పట్టుబడ్డాను. రాసుకో కేసు."

ఇంతలో సుబ్బారావు "ఒరే సత్యం దొంగను నేనురా!" అన్నాడు.

"అల్లాచెప్పు నువ్విక్కడే ఉన్నావా నాయనా!" అన్నాడు సుబ్బారావునిచూచి సత్యం.

"నాకొక వాగ్దానం చేస్తావా" అంటున్న సుబ్బారావుని సత్యం "నీమొహం ధర్మరాజులాంటి అన్నగారి కపకీర్తి తెచ్చిపెడుతున్నావు నీబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు" అన్నాడు చిదంబరం తెల్లబోయాడు.

రాజేశ్వరరావు "ఒరేయి ఈకేసు నువ్వు వాని మీదికి తోయ్యక నన్ను వెంటనే అరెస్టు చెయ్యటం న్యాయం."

సుబ్బారావు "నేనడిగినది చేస్తాననరా, నీపని తేలికవుతుంది" అన్నాడు. సత్యం వాడి తెలివి చిన్నప్పటినుంచి ఎగిరిఉన్నవాడు కనక వాడేదో ఉపాయం చెపుతాడని వాడికి నువ్వు చెప్పినట్లే చేస్తానని మాటయిచ్చాడు.

"అయితే నన్నరెస్టుచేసి జైల్లోపడై" అన్నాడు సుబ్బారావు చిదంబరంగారు ప్రశ్నార్థకంగా చూస్తున్నారు.

సత్యం "రాజూ వీడికి మాటలతో బుద్ధిచెపుదామనుకొన్నాగాని వాడు కోరి తెచ్చిపెట్టుకొన్నాడు. ఏమైనా వీడికి బుద్ధివచ్చింది. అదీ కావలసింది. నువ్వేం బాధపడకు. అని రాజేశ్వరరావుతోచెప్పి గుటకలు మింగుతున్న పక్కింటాయనతో మీ వస్తువు మీకు దొరికిందిగా మా రాజుని క్షమించండి. కేసు రాసుకుంటాను. వీణ్ణి జైలుకిపంపక తప్పిందికాదు. ఇటుపైన మారాజు చెప్పింది మీరు నమ్ముతారనుకొంటా" నంటూ సెలవు తీసికొని సుబ్బారావుతో సహా సబినస్పెక్టర్ సత్యం వెళ్ళిపోయాడు.

---

ఆకలి ఓ మూలనుంచి దహించేస్తూంటే ఒక మూలకాకి అత్తిచెట్టు చూసింది. తీరా దగ్గిరకి వెళ్ళాక అత్తిపళ్లు పచ్చిగావున్నాయి. అత్తిపళ్లు పండేక తిందామని ఆ కొమ్మమీదే కూర్చుంది. అలాగే ఎన్నాళ్లనుంచో అదే కొమ్మమీద కూర్చున్న కాకిని చూసి నక్క అడిగింది ఎందుకలా కూర్చున్నావని. కాకి చెప్పిన సమాధానం విని నక్క నవ్వి అంది కదా, "ఆశ నీ దృష్టియావత్తూ ఆవరించుకుంటే లాభ ఏమిటి? ఆశ నిన్ను మరిపిస్తుందేకాని నీ కడుపు నింపుతుందా? నింపదే!"